## క్లుప్తంగా

### నేడు మండల సమావేశం

పీసీపల్లి: మండల పరిషత్ సాధారణ సమావేశం గురువారం ఎంపీపీ జవన్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. సమావేశానికి కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు బుర్రా మధుసూధన్ యాదవ్ హాజరవుతారన్నారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

### పొగాకు అత్యధిక ధర రూ.201

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం కారుమంచి గ్రామ రైతులు 847 బేళ్లు తీసుకురాగా 815 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.201, కనిష్ట ధర రూ.165, సరాసరి ధర రూ.199.81 పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

**కొండపిలో 833 పొగాకు బేళ్ల కొనుగోలు**

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి కట్టావారిపాలెం, నరసింగోలు గ్రామాల రైతులు బుధవారం 860 బేళ్లు తీసుకురాగా 833 కొనుగోలయ్యాయి. అత్యధిక ధర కేజీ రూ.200, అత్యల్ప ధర రూ.170, సరాసరి ధర రూ.199.04 రైతులకు దక్కిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

### కూలీలందరికీ ఉపాధి హామీ పని



నందనవనంలో మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

సింగరాయకొండ: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని ఎంపీడీఓ పి.రామకృష్ణ పేర్కొన్నారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట, నందనవనం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కె.బిట్రగుంట పంచాయతీ పరిధిలోని సాగునీటి చెరువులో పూడికతీత పనులను పరిశీలించి, మస్టర్ తనిఖీ చేశారు. నందనవనం పొలాల్లో పూడికతీత పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

### బాధ్యతలు చేపట్టిన మర్రిపూడి ఇన్‌చార్జి ఎంపీడీఓ



రాజశేఖరరావును సన్మానిస్తున్న ఎంపీపీ

మర్రిపూడి: మర్రిపూడి ఇన్‌చార్జి ఎంపీడీఓగా కె.రాజశేఖరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పొదిలి ఈఓఆర్డీగా పనిచేస్తున్న రాజశేఖరరావుకు మర్రిపూడి ఇన్‌చార్జిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ఎండీఓను ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఈఓఆర్డీ ఎస్కే నాగూర్‌వలి, సర్పంచ్ కె.భాస్కర్, అన్ని పంచాయతీల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాఫా, టైపిస్టు ఎస్కే బాషా, మాదవ, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ ఒకరు మృతి



శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

జరుగుమల్లి (సింగరాయకొండ): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి బుధవారం ఒంగోలు జీజీహెచ్‌లో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లికి చెందిన మల్లవరపు శ్రీనివాసులు(44) మంగళవారం పొన్నలూరు మండలం శింగరగుంట్లపాలెం వెళ్తుండగా మార్గమధ్యంలో చింతలపాలెం వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు స్పందించి 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాసులు మరణించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

# శాశ్వత భూ హక్కు కల్పించడమే లక్ష్యం

- జగనన్న భూ హక్కు, భూరక్ష పథకంతో భూ వివాదాలు చెక్
- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ జగనన్న భూ శాశ్వత హక్కు, భూ రక్ష పథకంతో భూ వివాదాలకు తెర పడుతుందని, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో భూ సర్వేను డ్రోన్ కెమెరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ రైతుల, ప్రజల భూములకు, స్థలాలకు, ఇళ్లకు శాశ్వత హక్కును కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ హక్కు సర్వేను నిర్దేశించిన సమయానికి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సిగ్నల్స్ సాంకేతిక సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియతో ప్రతి ఖాళీ స్థలాన్ని, ఇంటిని గుర్తించి ఓ నంబర్ ఇస్తామన్నారు. పట్టణంలోని 9,456 గృహాలకు సంబంధించి జరిగే సర్వేలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ డీవీ నారాయణరావును ఆదేశించారు. భూ హక్కు, భూ రక్షణ పథకాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ మండల అధ్యక్షుడు, సొసైటీ సంగు సుబ్బారెడ్డి, తమ్మినేని సుజాత, పార్టీ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దేవరాజ్, దేవకి రాజీవ్, దాసరి మురళీ, రామనబోయిన శ్రీను, దేవకి రాజేష్, తిరుపతిరావు, బేరి భాస్కర్‌రెడ్డి, మాలకొండయ్య, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వీఆర్వోలు నాగేశ్వరరావు, బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రాజ్యశ్వరీ, నిర్మల, సునీత, పవన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

# గ్రామ స్వరాజ్యమే జగనన్న లక్ష్యం

కొండపి: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో బుధవారం సాయంత్రం అశోక్‌బాబు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు త్వరితగతిన గ్రామంలోనే పరిష్కరించడం కోసం సీఎం జగనన్న గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. సంక్షేమ పథకాల్లో ఎటువంటి అవకతవకలు లేకుండా వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి గృహసారథులను నియమించినట్లు చెప్పారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల నిధులను సైతం దోచుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే స్వామి మరుగుదొడ్ల నిధులు కోట్లాది రూపాయలను తన అనుచరులతో కలిసి దోచేశాడని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని, సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, ఎంపీటీసీ బొల్లా సుబ్బారావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- సబ్‌కలెక్టర్ శోభిక



సమావేశంలో పాల్గొన్న సబ్‌కలెక్టర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ, డీఎస్పీ



స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్న అధికారులు

కందుకూరు: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యానేరమని, వీటిని అరికట్టేందుకు స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని సబ్‌కలెక్టర్ శోభిక సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మిగిలిన శాఖల సమన్వయంతో లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా పెంచాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లు కచ్చితంగా నిబంధనలు పాటించేలా చూడాలని, పట్టణంలో ఎన్ని స్కానింగ్ సెంటర్‌లు ఉన్నాయనే వివరాలు సేకరించాలన్నారు. ప్రతి ప్రైవేట్ హాస్పిటల్‌లో కూడా ఈ నిబంధనల అమలు కచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించారు. అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్లను నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి అక్కడ నిబంధనలు అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ బాలికల పట్ల వివక్ష చూపడం సరైనదని కాదని, బాలికా విద్యను ప్రోత్సహించడం ద్వారా సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. వరకట్నం వంటి సమస్యను బాలికా విద్యను పెంచి వారికి స్వయం ప్రతిపత్తి కల్పించడం ద్వారా నివారించవచ్చన్నారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించే డాక్టర్‌లు, స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఉంచుతున్నామన్నారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆ కేంద్రాలను మూసివేస్తామని హెచ్చరించారు. డీఎస్పీ రామచంద్ర మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా నిర్వహించే స్కానింగ్ కేంద్రాలను మూసివేసేందుకు సహకారం అందిస్తామని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుగుణ, వెంకటసుబ్బయ్య, తులసీరామ్, జిల్లా ప్రోగామ్ అధికారులు శ్రీనివాసరావు, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించినా, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు ప్రియంవద హెచ్చరించారు. సబ్‌కలెక్టర్ శోభిక ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ, జిల్లా ప్రోగ్రాం అధికారులు డీఈఎంఓబి శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈఎంఓ కె.కనకరత్నం పట్టణంలోని ప్రైవేట్ కోటారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ముప్పారోశయ్య హాస్పిటల్, సుల్తాన్ మోహిద్దీన్ హాస్పటల్‌లలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించిన వారి స్కానింగ్ సెంటర్లను మూసివేస్తామని తెలిపారు. డాక్టర్ బ్యూలాగ్రేస్, హెచ్ఈఏ ఆరీఫ్ పాల్గొన్నారు.

# ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వేములపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ప్రత్యేకాధికారి, జాతీయ రహదారుల ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎంఎల్ నరసింహం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని చెక్ డ్యామ్‌లోని పూడిక పనులు చేసేందుకు అవకాశం ఉందా లేదా అని పరిశీలిస్తున్నామన్నారు. ఈ చెక్‌డ్యామ్ పూడిక పనులకు రూ.5 లక్షలతో చేయనున్నట్లు తెలిపారు. మండలంలో ఎంత మంది కూలీతో పనులు జరుగుతున్నాయని ఏపీఓని అడిగారు. ప్రతి కూలీకి పని లేదనకుండా 100 రోజులు కల్పించాలన్నారు. కూలీల బిల్లులు జాప్యం జరగకుండా చూడాలని ఏపీఓ వెంకటేశ్వర్లుకు సూచించారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, టీఏ వెంకటేశ్వర్లు ఉన్నారు.

# వైభవంగా సీతారాముల కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

పీసీపల్లి: మండల పరిధిలోని మారెళ్లలో సీతారాముల కళ్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. రామాలయ 2వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజుల నుంచి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో స్వామి కళ్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా సాగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

# చదివారు.. విన్నారు.. వెళ్లారు!



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

- తూతూమంత్రంగా ప్రజావేదిక

సింగరాయకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక తూతూమంత్రంగా సాగింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.6 కోట్ల పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ ప్రజావేదిక డ్వామా పీడీ కె.శీనారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 10 గ్రామాలకు సంబంధించి సోషల్ ఆడిట్ నివేదికను కేవలం 1.30 గంటల సమయంలో ముగించారు. ఈ ప్రజావేదికకు సంబంధించి ముందస్తు సమాచారం లేకపోవడంతో కూలీలు నామమాత్రంగా హాజరయ్యారు. జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, ఏపీడీ సుబ్బారావు, ఎస్ఆర్పీ సుబ్బారావు పాల్గొన్నారు.

### ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

వెలిగండ్ల: వెలిగండ్లలోని ఓ పొలం విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఇరువురు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈనెల 12న పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. కులంపేరుతో దూషించి తీవ్రంగా గాయపరిచాడని గొరిగె వెంకట ప్రసాద్‌పై తాతపూడి సత్యనందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. తన అనుమతి లేకుండా తన పొలంలోకి వచ్చి ఇష్టం వచ్చినట్లు తిట్టి కొట్టాడని తాతపూడి సత్యానందంపై గొరిగె వెంకట ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైంది. ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి డీఎస్పీ రామరాజు బుధవారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాక్షులను, ఫిర్యాదుదారులను విచారించారు. ఈయన వెంట ఎస్సై మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

**సింగరాయకొండలో...**

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి పంచాయతీ పరిధిలో ఉప్పు కొఠారుల వద్ద జరిగిన ఘర్షణకు సంబంధించి నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఉప్పు కొఠార్లు సాగు చేస్తున్న సామి సత్యన్నారాయణ తనపై దాడి చేశాడంటూ అదే గ్రామానికి అల్లాడి ఏడుకొండలు ఈనెల 17వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదైంది. డీఎస్పీ వెంట ఎస్సై మహమ్మద్ ఫిరోజ్‌ఫాతిమా ఉన్నారు.

# సేవకు ‘వందనం’



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కొనకనమిట్ల: సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైన్యంగా పనిచేస్తున్న గ్రామ వలంటీర్ల సేవలను ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు కొనియాడారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చినమనగుండం, చినారికట్ల, చింతగుంట గ్రామాల వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఆయా గ్రామాల వలంటీర్లు పాల్గొన్నారు.

### 1410 బేళ్లు విక్రయం

కందుకూరు: కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాల్లో బుధవారం జరిగిన వేలంలో 1410 బేళ్లను విక్రయించారు. వీటిలో కందుకూరు–1 వేలం కేంద్రంలో 669 బేళ్లను వేలానికి ఉంచగా 600 బేళ్లు, కందుకూరు–2లో 876బేళ్లను వేలానికి ఉంచగా 810 బేళ్లు అమ్ముడైపోయాయి. కేజీ పొగాకు గరిష్ట ధర రెండు వేలం కేంద్రాల్లోను రూ.200 లభించగా, కనిష్ట ధరలు వరుసగా రూ.160, రూ.180 వచ్చాయి.

### ఉపాధి హామీ పనిదినాలు పెంచాలి

వలేటివారిపాలెం: ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బీవీబీ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని బడేవారిపాలెంలో నాంచారమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల బృందం పర్యటించింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు నరసింహం, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# నిలి‘చిన’ ఆధార్ సేవలు



సోమరాజుపల్లిలో ఆధార్ నమోదు కేంద్రం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు, పాకల గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాల్లో గత 20 రోజులుగా సేవలు నిలిచిపోయాయి. దీంతో మండల ప్రజలు సోమరాజుపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆధార్ కేంద్రానికి క్యూకడుతున్నారు. రద్దీ కారణంగా గంటల తరబడి వేచి ఉండలేక చంటి పిల్లలు, మహిళలు అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ ఆసరా, వసతి దీవెనతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు పొందడానికి ఆధార్ తప్పనిసరి. అలాగే కొందరి ఆధార్ కార్డుల్లో వివరాలు మార్పులు, చేర్పులు చేయించాల్సి ఉంది. సోమరాజుపల్లి కేంద్రంలో రాత్రి 8 గంటల వరకు ఆధార్ సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మూలగుంటపాడు, పాకల పంచాయతీల్లో ఆధార్ సేవలను పునరుద్ధరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### నేడు విప్పగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని విప్పగుంట గ్రామంలో గురువారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

### పుస్తక పఠనంతో విజ్ఞానం

కొండపి: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు సూచించారు.

స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చైర్ గేమ్, పాటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో 16 మంది చిన్నారులు పాల్గొన్నారు.

# వైభవంగా కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట

- కనులపండువగా రఘునందనుని శాంతి కల్యాణం



గ్రామోత్సవంలో స్వామివార్ల మూల, ఉత్సవ మూర్తులు

పామూరు: మండలంలోని సుబ్బక్కపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట బుధవారం అర్చకుల వేదమంత్రాల నడుమ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా రుత్వికులు మూలమంత్రం, చండీహోమం, మహాగణపతి హోమం, లక్ష్మీ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ, హనుమంతుని మూల విగ్రహ మూర్తులకు పంచామృతాభిషేకం ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలతో ప్రతిష్ట చేసి తదుపరి ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. ప్రతిష్ఠా మహోత్సవం తరువాత స్వామి పంచలోహ ఉత్సవ మూర్తులకు విశిష్ట పూజలు చేసి మంగళ వాయిద్యాల నడుమ వేడుకగా స్వామివార్లకు ఎదురుకోల నిర్వహించి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తీసుకువచ్చి కనులపండువగా శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రతిష్ట సందర్భంగా భక్తులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పోకా నాయుడు, చెంచురామయ్య, రమణయ్య, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



ధ్వజస్తంభ ప్రతిష్ట